బాబోయ్.. తెగ తాగేశారు..!



కర్నూలు(అర్బన్), జనవరి 1:

కొత్త సంవత్సరం వేడుకల్లో మందుబాబులు రికార్డు సృష్టించారు. ఎన్నడూ లేనంతగా తెగ తాగేశారు. స్టార్ హీరో సినిమా ఓపెనింగ్ కలెక్షన్స్‌ను తలపించేలా లిక్కర్ సేల్స్ కనిపించాయి. డిసెంబరు 31 ఆదివారం కావడంతో... మందుబాబులు బరిలో దిగి సత్తా చాటారు. బీర్లతో పాటు హార్డ్ కూడా భారీగానే అమ్ముడుపోయింది. ఉమ్మడి జిల్లాలో డిసెంబరు 31న ఒక్క రోజే రూ.8.53,20,870 కోట్ల మద్యం తాగేశారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్ శాఖ అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలను తెరిచి ఉంచారు. దీంతో షాపుల ముందు మద్యం ప్రియులు, ముఖ్యంగా యువకుల రద్దీ కనిపించింది. కొత్త మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలను కుదించినా వ్యాపారం జోరుగా సాగింది. పెరిగిన మద్యం ధరలను సైతం లెక్క చేయకుండా మందు బాబులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది భారీగా మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.



- ఉమ్మడి జిల్లాలో జోరుగా లిక్కర్ బిజినెస్
- ఒక్క రోజులో రూ.8.53 కోట్ల వ్యాపారం
- మద్యం దుకాణాలు, బార్లు కిటకిట
- విందులు, వినోదాలతో చిందులు

అమ్మకాలతో దుకాణాలు కిటకిట..

కర్నూలు జిల్లాలో 95 దుకాణాలు, 27 బార్లు ఉండగా వాటి ద్వారా రూ.5,08,20,870, నంద్యాల జిల్లాలో 92 మద్యం దుకాణాలు, 21 బార్ల ద్వారా రూ.3.45 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని సెబ్ అధికారులు తెలిపారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలుండగా 40 శాతం కుదించి 192 దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తోంది. గత ఏడాది రూ.7.33 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా ఈ ఏడాది ప్రభుత్వ మద్యం దుకాణాలను కుదించినా కూడా దాదాపుగా రూ.8.53 కోట్ల మద్యం అమ్మకాలు జరగడంపై ఎక్సైజ్ అధికారులు సైతం నివ్వెరపోతున్నారు. కర్నూలు నగరంలో ఒక్కో దుకాణంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కరోజు రూ.12 లక్షల దాక వ్యాపారం జరిగింది. నంద్యాల, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో కూడా గతంలో కంటే అమ్మకాలు భారీగానే జరిగాయి. ఇక బార్లు సైతం అర్ధరాత్రి దాటినా కూడా కిక్కిరిసి కనిపించాయి. ఉమ్మడి జిల్లాలోని 48 బార్లలో కూడా రాత్రి ఒంటిగంట తర్వాత కూడా అమ్మకాలు జోరుగా సాగాయి.





మందుబాబుల హల్‌చల్..

పట్టణాలు, మండల కేంద్రాల్లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కర్నూలు నగరంలో మందుబాబులు తప్పతాగి చిందులేశారు. రోడ్లపై బైక్‌లతో చక్కర్లు కొట్టారు. బైక్‌ల సైలెన్సర్లను తొలగించి రైజ్ చేస్తూ భారీ శబ్దాలతో హంగామా సృష్టించారు. విజిల్స్, కేకలు వేస్తూ కనిపించారు. బాణసంచా పేలుస్తూ వేడుకలు నిర్వహించుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు పోలీసుల ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ యువత మద్యం మత్తులో చిందులేసింది. పార్టీలు, విందులు, వినోదాలతో అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించుకున్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి బళ్లారి వెళ్లే రహదారి, వెంకటరమణ కాలనీ, పాతబస్తీ, నంద్యాల చెక్ పోస్టు పరిధిలోని జోహరాపురం రోడ్డులో యువత చిందులేస్తూ, బైక్‌లపై విన్యాసాలు చేస్తూ కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

న్యూ ఇయర్ సందడి

- జిల్లా అంతటా కోలాహలం
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు
- అధికారులు, నేతల కార్యాలయాల్లో కేక్ కటింగ్‌లు


కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నంద్యాల (కల్చరల్), జనవరి 1: నూతన సంవత్సరం..2024కు జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. న్యూ ఇయర్ రోజున వేడుకలు అంబరాన్ని అంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వేడుకలు సోమవారం సాయంత్రం వరకు జరిగాయి. చర్చిలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. కేక్ కటింగ్‌లు, ఒకరినొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకుంటూ చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా సందడి చేశారు. నూతన సంవత్సరాన్ని ప్రజలు ఘనంగా ఆహ్వానించారు. పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకున్నారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో...


పూలమొక్కను ఇస్తున్న జేసీ

నూతన సంవత్సర వేడుకలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్‌జీఓలు కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నంద్యాల జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలన్నారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో పుల్లయ్యలకు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలం, జనవరి 1: నూతన సంవత్సరం మొదటిరోజున శ్రీశైలం భక్తులతో కిక్కిరిసింది. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో సోమవారం స్వామివారికి సామూహిక అభిషేకాలతో పాటు స్వామివారి స్పర్శదర్శనాన్ని నిలుపుదల చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చి క్యూలైన్లలో బారులుదీరారు.

జీతాలు పెంచాలి

- దీక్షా శిబిరంలో కేక్ కట్ చేసి వినూత్న నిరసన
- 7వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


నంద్యాలలో దీక్షా శిబిరంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 1 : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, ఇప్పటి వరకు సమస్యలను పరిష్కరించకుండా నాన్చుతూ వచ్చిన వైసీపీ ప్రభుత్వం కొత్త ఏడాదిలో ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సీఐటీయూ, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు హితవు పలికారు. సోమవారం మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 7వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయంలో ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. కొత్త ఏడాదిలోనైనా జీతాలు పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటూ దీక్షా శిబిరంలో మున్సిపల్ కార్మికులు కేక్ కట్ చేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి భాస్కరాచారిల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, జీతాలు పెంచుతామని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని బుకాయించి గత ఎన్నికల్లో కార్మికుల ఓట్లను పొంది అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, కార్మిక సంఘం నాయకులు, కార్మికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

మూల్యం చెల్లించక తప్పదు

గోస్పాడు, జనవరి 1: అంగన్‌వాడీల దీక్షను చిన్నచూపు చూస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నిర్మల, రమణమ్మ, సువర్ణ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు చేస్తున్న అంగన్‌వాడీల నిరవధిక దీక్ష సోమవారంతో 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తరువాత సమస్యలను పట్టించుకోకుండా మరిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణాకు మించి వేతనాలు చెల్లిస్తామని చెప్పిన మాట తప్పడం సరికాదని అన్నారు. సుప్రీంకోర్టు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. అనంతరం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

21 రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరవధిక దీక్షలు


దీక్షా శిబిరంలో బైఠాయించిన అంగన్‌వాడీలు

న్యూ ఇయర్ వేడుకల్లో నాయకులు


ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి


బేతంచెర్లలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి నాయకుల శుభాకాంక్షలు


గడివేములలో గౌరు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు


మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


నందికొట్కూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు మాండ్ర శివానంద రెడ్డి


ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో...


నంద్యాల పట్టణంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆధ్వర్యంలో...

నంద్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు నంద్యాల జిల్లా రాజకీయ నేతల్లో ఉత్సాహాన్ని నింపాయి. అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నేతలు కేక్ కట్ చేసి టీడీపీ కార్యకర్తలతో పాటు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నేతలకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. నంద్యాల జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌ను పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, గడివేములలో మాజీ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, గౌరు చరిత, మాజీ మంత్రులు ఎన్ఎండి ఫరూక్, భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా నందికొట్కూరులో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, డోన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి. ఇదిలా ఉండగా బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉన్నారు.


కోడుమూరులో కోట్లసూర్యప్రకాశ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


కర్నూలు సిటీలో టీజీ భరత్ ఆధ్వర్యంలో...


ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి సత్కారం


కర్నూలు టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడుకు శుభాకాంక్షలు


నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్...


పత్తికొండ టౌన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు...


మంత్రాలయంలో తిక్కారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు


ఆదోనిలో టీడీపీ నాయకుడు బత్తిన లక్ష్మీనారాయణ...


గౌరు చరిత, వెంకటరెడ్డి సమక్షంలో న్యూ ఇయర్ వేడుకలు

టీడీపీ నేతల్లో న్యూ ఇయర్ జోష్

కర్నూలు(అర్బన్), జనవరి 1: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నూలు టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కోడుమూరులో మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్, ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, పత్తికొండలో కేఈ శ్యాంబాబు, మంత్రాలయంలో తిక్కారెడ్డి, పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డికి టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదోనిలో టీడీపీ నాయకుడు, పారిశ్రామికవేత్త బత్తిన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి.

'కాబోయే సీఎం చంద్రబాబే'


పూజలు చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 1: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపొందాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని ఆ దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో రాష్ట్రానికి దరిద్రం పోతుందని, వైసీపీ ఎన్నికల్లో గల్లంతు కావడం తథ్యమని అన్నారు.

ఐదో తేదీలోగా విధులకు హాజరు కావాలి

అంగన్‌వాడీలకు కలెక్టర్ విజ్ఞప్తి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 5వ తేదీలోపు అంగన్‌వాడీ ఉద్యోగులు విధులకు హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో డిసెంబరు 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. కొన్ని డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. దీనికి సంబంధించి జీవోలను కూడా ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వల్ల బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి విధులకు రావాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒక వేళ సమ్మె విరమించకపోతే ప్రభుత్వ నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి

ఆళ్లగడ్డ, జనవరి 1: చాగలమర్రి మండలంలోని శెట్టివీడు సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న వెంకటలక్ష్మమ్మ(40) ఆళ్లగడ్డ మండలంలోని చింతకొమ్మ దిన్నె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఆమె భర్త నరసింహుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆళ్లగడ్డ మున్సిపాల్టీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో నివాసం ఉంటున్న వీఆర్వో వెంకటలక్ష్మమ్మ మోటార్ సైకిల్‌పై భర్త నరసింహుడుతో కలిసి సచివాలయానికి బయల్దేరారు. కోటకందుకూరు గ్రామానికి ఇస్మాయిల్ మోటార్‌సైకిల్‌పై కుటుంబంతో వెళ్తుండగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వీఆర్వో మృతి చెందారు. గాయపడిన వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి హత్య

- తాగిన మైకంలో దాడిచేసిన వైసీపీ కార్యకర్తలు
- నూతన సంవత్సర వేడుకల్లో విషాదం
- 12 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు


ఖాధర్ (ఫైల్)

డోన్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో పాత కక్షలు భగ్గుమని ఓ యువకుడి హత్యకు దారితీశాయి. సోమవారం తెల్లవారుజామున డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనలో డోన్‌కు చెందిన ఖాదర్ (30) అనే యువకుడు మృతి చెందాడు. డోన్ పట్టణంలోని చిగురుమాను పేటకు చెందిన ఖాదర్ తండ్రి లక్ష్మీనారాయణ ఉంగరానిగుండ్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చిన్నమద్ది కుమారుడు ఓబులేసుకు, ఖాదర్‌కు కొన్ని నెలల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల మధ్య కక్షలు పెరిగాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఖాదర్ ఆదివారం రాత్రి డోన్ పట్టణంలో తన స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నాడు. ఆ సమయంలో ఉంగరానిగుండ్ల గ్రామంలో వైసీపీకి చెందిన వ్యక్తులు లక్ష్మీనారాయణ ఇంటి మీద దాడి చేశారు. ఇందులో ఖాదర్ తమ్ముడు రవి గాయపడ్డాడు. ఈ విషయం తెలిసి ఖాదర్ తన స్నేహితులతో కలిసి ఉంగరానిగుండ్లకు వెళ్లాడు. వైసీపీ నాయకుడు చిన్నమద్ది కుమారులు, అనుచరులు రెచ్చిపోయి రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఖాదర్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా ఖాదర్ మార్గమధ్యంలోనే మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మృతుని తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన ఓబులేసు, సిసింద్రీ, నవీన్, చిన్న మధు, చిన్నమద్ది, అబ్దుల్, ఖాజా, అహ్మద్, షరీఫ్, మను, రంగస్వామి, పవన్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు అండగా ఉందాం : కేడీసీసీబీ చైర్‌పర్సన్


సహకార బ్యాంకులో నూతన సంవత్సర వేడుకల్లో చైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 1: జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అన్ని విధాలుగా ప్రగతిపథంలో నడిపించి రైతులకు అండగా ఉందామని చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రాంగణంలో నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకు లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, సునీల్ కుమార్, ఏజీఎం శివలీల, త్రినాథ్ రెడ్డి ఉన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు


డీఈఓను కలిసి బొకే అందజేస్తున్న శ్రీనివాసులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 1: జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎ.శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కర్నూలు ఐఏఎస్ఈలో వి.శ్రీనివాసులు సూపరింటెండెంట్‌గా పని చేస్తూ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. గతంలో ఈ పోస్టులో ప్రకాశ్‌రెడ్డి పని చేస్తూ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్యామ్యూల్ పాల్ ఇన్‌చార్జి బాధ్యతలు కొనసాగిస్తూ వచ్చారు. రెగ్యులర్ ఏడీగా శ్రీనివాసులు రాకతో ఈ పోస్టు భర్తీ అయింది. ఏడీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు డీఈవో రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

యువకుడిపై దాడి

ఎమ్మిగనూరు, జనవరి 1: ఎమ్మిగనూరు పట్టణ పరిధిలోని లక్ష్మీపేటకు చెందిన యువకుడు షేక్ మహబూబ్‌బాషాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. లక్ష్మీపేటకు చెందిన షేక్ చాంద్‌బాషా కుమారుడు మహబూబ్‌బాషా ఆదివారం అర్ధరాత్రి మాచాని సోమప్ప స్కూల్ దగ్గర ఉండగా...కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కట్టెలతో దాడి చేశారు. దీంతో మహబూబ్‌బాషా తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బాధితుడి అన్న షేక్ అలిభాషా ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు


మంఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జనవరి 1. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయంలో భక్తులు పోటెత్తారు. సోమవారం నూతన సంవత్సరం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

నందికొట్కూరు రూరల్, జనవరి 1: నెహ్రూనగర్ గ్రామంలోని వైసీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో బండి జయరాజు, కాశిరాజు, హెమసుందరాజు, లోకానందరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఫారుక్ భాష, జల్లి శ్రీను, కల్లు నాగన్న, గొల్ల చిన్న లక్ష్మయ్య, నరసింహరాజు, త్యాగరాజు, మద్దిలేటి, మధుతో పాటు పది కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకొని టీడీపీలో చేరారు. వీరందరిని మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని బిజినవేముల గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మబిజినవేముల టీడీపీ నాయకులు మద్దిలేటి, కిరన్‌కుమార్‌రెడ్డి, బాబులాల్, సాంబశివుడు, నారాయణల ఆధ్వర్యంలో బిజివేముల గ్రామ వైసీపీ నాయకులు గొల్ల చిన్న యాదవ్, అక్బర్ హుసేన్, ఖాజాహుసేన్, సుదర్శనం, శివలింగం, శంకర్, గరీబ్, పెద్దబాబు, ఇబ్రహీం, మొల్లఖలీల్, తదితరులతో పాటు ఇంకొంతమంది వైసీపీ వీడి టీడీపీలో సమక్షంలో చేరారు.

టీడీపీ కండువా కప్పుకున్న నాయకులు



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

మహానంది, జనవరి 1: మహానంది గ్రామానికి చెందిన నాయకులు సోమవారం శ్రీశైలం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నూతన ఆంగ్ల సంవత్సరం పురష్కరించుకొని నియోజకవర్గ కేంద్రం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో మహానంది మండల టీడీపీ నాయకులు గని చిన్నరంగస్వామి ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బుడ్డాను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహానంది గ్రామానికి చెందిన కుంచపు రవి, నూరే శ్రీనివాసులు, సుబ్బరాయిడు, లక్ష్మీనారాయణలు బుడ్డా సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రామలింగారెడ్డి, గోపవరం మాజీ ఎంపీటీసీ కృపావరం పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించండి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్టేట్ నోడల్ అధికారి

గడివేముల, జనవరి 1: మండల కేంద్రంలో మంగళవారం జరిగే జగనన్న ఆరోగ్యసురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్టేట్ నోడల్ అధికారి రామనాథం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందించే సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి మందులు వచ్చాయా లేదా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, ఎన్‌సీడీసీడీ నోడల్ అధికారి కాంతరావునాయక్, జేఏఎస్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి సునీత, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ప్రభుత్వ వైద్యులు జబిన్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



కేక్ కట్ చేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

కొత్తపల్లి, జనవరి 1: సీఎం జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు పాదయాత్రలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, కేవీపీఎస్ జిల్లా నాయకులు భాస్కర్, వ్యవసాయ కార్మికం సంఘం జిల్లా నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, మండల నాయకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం మాట్లాడుతూ 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులు తక్షణమే చెల్లించాలని, అంగన్‌వాడీ వర్కర్లకు సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో భాగంగా వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రమణమ్మ, వసంత, లక్ష్మీదేవి, జయమ్మ, శ్రావణి, సోమేశ్వరి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నియంతృత్వ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

నంద్యాల టౌన్, జనవరి 1: వచ్చే ఎన్నికల్లో నియంతృత్వ వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వైసీపీ ఓటు బ్యాంకుగానే చూస్తున్నదని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పని చేయాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలి'

వెలుగోడు, జనవరి 1: ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలని ఎంఈవో బ్రహ్మంనాయక్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం ఆయన యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా బోధన నేర్పి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన అందరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రఫి, రామకృష్ణ, నాగస్వామిజాకీర్ హుసేన్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నంద్యాల పట్టణంలోని వట్టివేర్లతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి



నంద్యాల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొత్త ఉత్సాహం

నూతన సంవత్సర వేడుకలను జిల్లా వాసులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరుపుకున్నారు. కేక్ పరస్పరం పంచుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో పూజలు జరిగాయి. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. యువకులు సందడి చేశారు. ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద అభిమానులు కార్యకర్తల హడావుడి కనిపించింది. అధికారులు ప్రజలుకు కొత్త సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు.

- ఉల్లాసంగా న్యూ ఇయర్ వేడుకలు
- బొకేలు, స్వీట్లతో శుభాకాంక్షలు
- ఆలయాల్లో పూజలు.. చర్చిలలో ప్రార్థనలు



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, జేసీ



జేసీకి పూల మొక్కను అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఆత్మకూరులో మాజీ హజ్ కమిటీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న జిల్లా సర్వేయర్, సిబ్బంది



శ్రీశైలంలోని మాడ వీధుల్లో భక్తుల రద్దీ



మాజీ ఎమ్మెల్యేకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం



పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో..



తంగడంచ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నంద్యాల (కల్చరల్)/ జూపాడుబంగ్లా/ పగిడ్యాల/ పాణ్యం/కొత్తపల్లి / బండిఆత్మకూరు/ నందికొట్కూరు రూరల్/ గడివేముల/ ఆత్మకూరు/రూరల్, జనవరి 1: నంద్యాల పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయం, బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయం, ప్రథమ నందీశ్వర స్వామి ఆలయం, సుద్దుల పేటలోని శ్రీకృష్ణ మందిరం, కాళికాంబ చంద్రశేఖర స్వామి, అమ్మ స్ఫటిక లింగేశ్వరాలయం, సాయిబాబా ఆలయం తదితర ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. సంజీవ నగర్ వెంకటేశ్వర్ల స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నూతన సంవత్సరంలో తమకు మంచి జరగాలని లక్ష్మీఅష్టోత్తర గోదాదేవి పూజలు, విష్ణు సహస్ర నామం, ధూపదీప నైవేద్యంతో పూజలు నిర్వహించారు. అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద తమ అభిమానుల సందడి నెలకొంది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి శనివారం అర్ధరాత్రి నుంచి పట్టణంలోని పలు చర్చిలలో ప్రార్థనలు జరిపారు. జూపాడుబంగ్లా, పాణ్యం మండలంలో, పగిడ్యాల మండలాల్లో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీలకు ఎంపీడీవో వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియజేశారు. బండిఆత్మకూరు మండలంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ సునీతలను మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు నేతృత్వంలో బుడగ జంగాల సంఘం పెద్దలు పూలమాలలు వేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండల అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డికి పలు గ్రామాల నాయకులు, మండల అధికారులు మండల పరిషత్ కార్యాయంలో న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద నూతన సంవత్సర కోలాహలం నెలకొంది. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత, ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో అధికారులు, అనధికారులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గడివేముల మండలం బూజనూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని నాయకులు పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితను, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మాండ్ర శివానందరెడ్డిలకు నాయకులు కార్యకర్తలు పూల మాలలు వేసి శుభాకాంక్షలను తెలిపారు.

- ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఈఏడాది న్యూఇయర్ వేడుకలు ఎవరూ ఊహించని విధంగా జరిగాయి. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు ఆత్మకూరు నుంచే కాకుండా శ్రీశైలం, మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయా గ్రామాల నాయకులు మాజీ ఎమ్మెల్యేను బుడ్డాను గజమాలలతో సత్కరించి ఆయనతో కట్ చేయించారు. ఆత్మకూరులోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పాకు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపేందుకు ఆ పార్టీ నాయకు లతో పాటు పలుశాఖ అధికారులు, పలు వర్గాల జనం తరలివచ్చారు. రాష్ట్ర హజ్‌కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ స్వగృహంలో, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా గృహంలో, సీపీఎం కార్యాలయం న్యూఇయర్ వేడుకలు జరిగాయి.
- వెలుగోడు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ కేక్ కట్ చేసి ఖాతాదారులకు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు.



కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



చర్చిలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

వైసీపీకి భారీ షాక్

- వడ్లరామాపురానికి చెందిన 250 కుటుంబాలు టీడీపీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే
- ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?
- సైకో జగన్ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైంది: బుడ్డా ధ్వజం



మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఆత్మకూరు, జనవరి 1: న్యూ ఇయర్ వేడుకను పురస్కరించుకుని గ్రామంలోని పలు సామాజిక వర్గాల నుంచి సుమారు 250 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ అత్తగారి గ్రామమైన వడ్లరామాపురంలో తొలి నుంచి టీడీపీకి ఆదరణ ఉండేదని, అయితే గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ పేరుతో జగన్, మోసపూరిత హామీలతో ఎమ్మెల్యే శిల్పా చెప్పిన మాటలు నమ్మి వడ్లరామాపురంలో ప్రజలు మోసపోయారని అన్నారు. అయితే వాస్తవ పరిస్థితులను తెలుసుకుని తిరిగి టీడీపీలోకి రావడం సంతోషకరమని చెప్పారు. ఇకపోతే రాష్ట్రంలో సైకో జగన్ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్ని రద్దు చేసి ప్రజలకు అన్యాయం చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో నయవంచన చేశారని అన్నారు. అసలు నవరత్నాలంటేనే ప్రజలకు తెలియని దుస్థితి ఏర్పడిందని వివరించారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా ఎన్నికల ముందు వడ్లరామాపురం గ్రామానికి ఎన్నో హామీలు ఇచ్చి నేడు ఏ ఒక్కటి నెరవేర్చలేదని దుయ్యబట్టారు. అసలు ఎక్కడి నుంచో వలసొచ్చిన శిల్పాకు ఇక్కడి ప్రజల కష్టాలు ఏం తెలుసని ప్రశ్నించారు. కేవలం డబ్బుతో రాజకీయం చేయాలన్న ధ్యాసే తప్ప ప్రజాభిమానమేంటో తెలియని వ్యక్తి శిల్పా అని విమర్శించారు. తమ కుటుంబం వడ్లరామాపురం గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, కంచర్ల గోవిందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, శాఖమూరి గిరిరాజు, అబ్దుల్లాపురం బాష, కొప్పరపు రవిప్రసాద్, శ్రీరామ్‌రెడ్డి, ధర్మారెడ్డి, లింగస్వామి తదితరులు ఉన్నారు.

వరదరాజ స్వామికి ప్రాజెక్టుకు కృష్ణా జలాలు అందిస్తా : నల్లమలలోని వరదరాజ స్వామి ప్రాజెక్టును సందర్శిస్తే పదవులు ఊడతాయన్న సెంటిమెంట్లు ఉన్నప్పటికీ ఆయకట్టు రైతాంగం కోసం త్వరలోనే ప్రాజెక్టును సందర్శించి తీరుతానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యేకించి వర్షాధారిత ప్రాజెక్ట్ అయిన వీఆర్‌ఎస్పీకి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలను అందించేందుకు పాటు పడుతానని హామీ ఇచ్చారు. అలాగే వడ్లరామాపురం నుంచి కురుకుందకు లింగస్వామి ఆలయం మీదుగా తారు రోడ్డు నిర్మిస్తామని అన్నారు. అదేవిధంగా ఆత్మకూరు ప్రాంతంలో టెంపుల్-టూరిజం ప్రాజెక్ట్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పన అందించేందుకు చొరవ తీసుకుంటానని తెలిపారు.

వైసీపీ వార్డు సభ్యుల చేరిక : వడ్లరామాపురంలో అధికార వైసీపీ నుంచి ముగ్గురు వార్డు సభ్యులు టీడీపీలోకి చేరారు. 4,6,11 వార్డుల సభ్యులు కురుకుంద హుసేన్, మెనిగొండ రమణయ్య, హరితలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి



చాగలమర్రిలో మోటార్‌సైకిల్ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 1: నారా చంద్రబాబునాయుడు 9న ఆళ్లగడ్డకు వస్తుండడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు తరలిరావాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం చాగలమర్రి గ్రామంలో టీడీపీ నాయకులు మోటార్‌సైకిళ్లపై ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో జరిగే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ముల్లా శ్యాబుల్, తెలుగు యువత అధ్యక్షుడు మాబులాల్, మౌళాలి, అనిఫ్, ఖాజారసూల్, కొలిమిసోను, గఫార్, అజీమ్, ఖలీల్, అక్బర్, రజాక్, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



ముత్యాలపాడులో అయోధ్యరాముడి అక్షింతలు అందజేస్తున్న ఎస్ఎస్ఎఫ్ సభ్యులు

చాగలమర్రి, జనవరి 1: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో అయోధ్య శ్రీరామ అక్షింతలను ఎస్ఎస్ఎఫ్ సభ్యులు ఇండ్ల సుదర్శన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. పూజ చేసిన అక్షింతలను ఎస్ఎస్ఎఫ్ సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందజేశారు. తోడెండ్లపల్లె, చక్రవర్తులపల్లె తదితర గ్రామాలకు అయోధ్యరామ అక్షింతలు అందజేశామని ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి ఇండ్ల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు హనుమంతు, సురేష్ బాబు, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె గ్రామంలో సోమవారం అయోధ్య శ్రీరామ అక్షింతలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ నెల 1 నుంచి 5 వరకు అయోధ్య రామమయ శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలు గ్రామంలోని ప్రతి ఇంటికి అందిస్తామని గ్రామమ పెద్దలు తెలిపారు.

యాగంటిలో సినిమా షూటింగ్



యాగంటి పెద్ద కోనేరులో షూటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె , జనవరి 1: మండలంలోని యాగంటి క్షేత్రంలో సోమవారం సినిమాషూటింగ్ జరిగింది. సోమ, మంగళవారం రెండురోజుల పాటు షూటింగ్ జరుగనుంది. రాజరాజ చోర సినిమా దర్శకుడు హసిత్‌గోలీ దర్శకత్వంతో టీజీ విశ్వప్రసాద్ నిర్మాతగా పీపుల్స్ మీడియా పతాకంపై సినిమా షూటింగ్ పెద్ద కోనేరులో చేశారు. శ్రీవిష్ణు హీరోగా, రీతూవర్మ కథానాయికగా సినిమా షూటింగ్ కొనసాగింది. పెద్ద కోనేరు వద్ద పిల్లలకు నామకరణం, అక్షరాభ్యాసం తదితర సీన్లు చిత్రీకరించారు. మీరాపురం, యాగంటిపల్లె తదతర గ్రామాల నుంచి కూడా కొందరు షూటింగ్‌లో పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో రజతం

చాగలమర్రి, జనవరి 1: మండలంలోని మూదురాళ్లపల్లె గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి, శోభారాణి దంపతుల కుమారుడు నరసింహా, పవన్‌రెడ్డి జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రజతాన్ని సాధించారు. రాజంపేట ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల విశాఖలో జరిగిన జాతీయస్థాయి బీచ్‌రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలో 58 కేజీల విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచి సిల్వర్‌మెడల్ సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి నరసింహాపవన్‌రెడ్డికి బీచ్ గ్రాప్లింగ్ ప్రతినిధులు ధినేష్‌కపూర్, బ్రిజ్ శర్మ, ఏపీ ప్రెసిడెంట్ సురేంద్రారెడ్డి మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. గ్రామీణ విద్యార్థి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఎస్ఐ హుస్సేన్ వలిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఎస్ఐగా ఎన్నికైన హుసేన్‌వలిని సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు నాగార్జునరెడ్డి

కోవెలకుంట్ల, జనవరి 1: ఎస్ఐగా ఎంపికైన హుసేన్‌వలిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోవెలకుంట్ల మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కలుగొట్ల టీడీపీ నాయకుడు గడ్డం నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలుగొట్ల గ్రామానికి చెందిన షేక్‌హుసేన్‌వలి ఇటీవల విడుదల చేసిన ఎస్ఐగా ఎంపిక య్యారన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివినప్పుడే ఉన్నతశిఖరాలకు చేరుకోవచ్చన్నారు. హుసేన్‌వలి ఎంపిక కావడం వల్ల గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తెచ్చారని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీపై బహిరంగ సమావేశం

కోవెలకుంట్ల, జనవరి 1: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా, ఏపీవో శ్రీవిద్య సోమవారం తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కోవెలకుంట్ల మండలంలో 1.4.22 నుంచి 31.3.23 వరకు 17వ విడత ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో గత 18 రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసిందన్నారు. గ్రామ సభలో వాటిని వెల్లడించడం జరిగిందన్నారు. వీటిపై ఈనెల 3వతేదీ బుధవారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి కూలీలు హాజరుకవాలన్నారు.

వీఆర్వో మృతి బాధాకరం

చాగలమర్రి, జనవరి 1: మండలంలోని శెట్టివీడు గ్రామంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో వెంకటలక్ష్మి (41)సోమవారం చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వెంకటలక్ష్మి తన భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా వెనుకవైపు నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పడకండ్ల నుంచి చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయం వస్తుండగా ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ విజయ్‌కుమార్, వీఆర్వో వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న వెంకటలక్ష్మి మృతికి సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. వీఆర్వోలు, గ్రామ సేవకులు సంతాపం ప్రకటించారు.



చాగలమర్రి కోదండరామాలయంలో భక్తుల పూజలు



ప్యాపిలిలో సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి



రూపనగుడిలో శిలువ ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

న్యూఇయర్ వేడుకలు

● కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు, మసీదులు ● నాయకుల ఇళ్ల వద్ద కార్యకర్తల కోలాహలం



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బేతంచెర్ల టీడీపీ నాయకులు



ఆళ్లగడ్డ బీజేపీ నాయకుడు కిశోర్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యకర్తలు

నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నాయకుల ఇళ్ల వద్ద కార్యకర్తల కలాహలంగా మారింది. తెల్లవారుజామున నుంచే ప్రజలు ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సరం అంతా మంచిగా జరిగాలని దేవుడిని ప్రార్థించారు.

బనగానపల్లె , జనవరి 1: బనగానపల్లె కొత్తబస్టాండులోని టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధక్యక్షుడు టంగుటూరు శ్రీనయ్యకు, యాగంటి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డికి ఆయన కార్యాలయంలో పలువురు పూలమాలలు వేసి శుభాకాంక్షలు అందించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి న్యూఇయర్ వేడుకలకు దూరంగా ఉంటానని ప్రకటించడంతో టీడీపీ కార్యాలయం బోసిపోయింది.

ఉయ్యాలవాడ: మండంలోని అన్ని గ్రామాల్లో 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా చర్చీల్లో క్రైస్తవులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోసన్నా మందిరంలో ఫాస్టర్ రమేష్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉయ్యాలవాడలో ఫాస్టేట్ చైర్మన్ జోషినతానియోలు, మాయలూరు సీఎస్ఐ చర్చీలో ఫాస్టర్ ప్రేమ్‌కుమార్, ఒంటెద్దుపల్లె గ్రామ ఆర్సీయం చర్చిలో ఫాదర్ జోసఫ్ క్రైస్తవులనుద్దేశించి ప్రసంగించారు.

కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలి: మంత్రి

డోన్, జనవరి 1: అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు కొత్త లక్ష్యాలతో ముందుకు సాగుదామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో మంత్రి బుగ్గన ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూఇయర్ కేక్‌ను కట్ చేశారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ప్రజలకు అభివృద్ధి చేసి చూపించామన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, తాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యత ఇచ్చి నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డోన్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, బొబ్బల శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల వద్ద తెల్లవారుజామునే న్యూఇయర్ వేడుకల అక్షరాలతో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ చిన్నమల్కాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ పారిశ్రామికవేత్త డి.కృష్ణారెడ్డి దంపతులకు ఇంటి వద్ద అభిమానులు, ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబుకు అండగా నిలుద్దాం

● టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జనవరి 1: కొత్త ఏడాదిలో రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబుకు అండగా నిలుద్దామని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుబ్బారెడ్డి నివాసంలో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల విశ్వాసం కోల్పోయారనీ అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వానికి ప్రజలు ఓటు వేసి టీడీపీని అధికారంలోకి తెస్తారన్నారు. కొత్త సంవత్సరంలో డోన్ నియోజకవర్గ ప్రజలకు అంతా మేలు జరగాలని కోరుకుంటున్నానీ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ నివాసంలో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విదంగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళికృష్ణ గౌడు నివాసంలో, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు నివాసాలో న్యూఇయర్ వేడుకలను నిర్వహించారు. అదే విదంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య ఆధ్వర్యంలో న్యూఇయర్ కేక్‌ను కట్ చేశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ప్రాంతంలోని ప్రజలంతా నూతన సంవత్సర ప్రారంభ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలకు ఐచ్చిక సెలవు ఇవ్వడంతో చిన్నారులు, విద్యార్థిని, విద్యార్థులు ఒకరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉల్లాసంగా తిరిగారు. కోలాహలంగా రాజకీయ పార్టీల నాయకుల గృహాలు నూతన సంవత్సర ప్రారంభ వేడుకల్లో భాగంగా పట్టణంలోని మాజీ మంత్రి అఖిలప్రియ, బార్గవ్‌రామ్‌నాయుడు, విఖ్యాతరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి, జనసేన నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఎంపీపీ రాఘవేంద్రారెడ్డి స్వగృహాలు నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారాయి.

శిరివెళ్ల: మండల ప్రజలు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ నాయకులు ఆళ్లగడ్డకు తరలి వెళ్లి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్ నాయుడు, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు. బోయలకుంట్ల గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి దంపతులను ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు, కార్యకర్తలు సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఆయా పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాను టీడీపీ నాయకులు, బీసీ సంఘ సభ్యులు, హమాలియూనియన్ నాయకులు గజమాలతో సన్మానించి వేడుకలు జరుపుకున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

ప్యాపిలి, జనవరి 1: కొత్త సంవత్సరం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆలయాలకు భక్తులతో కిటకిట లాడాయి. సాయిబాబా, పెద్దమ్మ, దుర్గాదేవి, హనుమాన్ ఆలయాల్లో మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పిల్లలు గ్రీటింగ్‌లు పంపిణీ చేసుకొని కొత్త సంవత్సరం భుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు.

రుద్రవరం: రుద్రవరంలోమండల పరిషత్ తహసీల్దారు, ఫారెస్టు కార్యాలయాల్లో సిబ్బంది తహసీల్దారు రవీంద్ర ప్రసాద్, రేంజర్ శ్రీపతి నాయుడు, ఎంపీపీ బాలస్వామి, ఎంపీడీవో మధుసూదనర్‌రెడ్డిలకు ఆయా కార్యాలయాల్లో సిబ్బంది సోమవారం నూతన సంవంత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి పీఆర్ఏఈ వెంకటరాముడు, డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా, ఏపీవో ప్రతాప్ పాల్గొన్నారు.

సంజామల: నూతన సంవత్సరం వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కానాలలో టీడీపీ సీనియర్ నాయకుడు కేశవరెడ్డి, శేషారెడ్డి సోదరులకు వారి నివాసగృహం టీడీపీ కార్యకర్తలతో సందడిగా మారింది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలతో సత్కరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

బేతంచెర్లలో ఘనంగా న్యూఇయర్ వేడుకలు

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల నుంచి సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి మండల టీడీపీ కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మికి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావల ఇచౌదరిల ఇళ్లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ 10వ వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లనాగయ్య, షేక్షావలి చౌదరి ఉన్నం చంద్రశేఖర్, సుధాకర్, ఎర్రమల నాయుడు, తిరుమలేష్ చౌదరి, రామగోపాల్, రామాంజనేయులు, రామ్మూర్తి, నంద్యాల మధు, మేకల నాగరాజు, రూబెన్, రవీంద్ర నాయక్, రాముడు, కార్యకర్తలు ఉన్నారు.



డోన్‌లో టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు



జనసేన నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులను అభినందిస్తున్న కార్యకర్తలు



బోయలకుంట్లలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు



సంజమాల కానాలలో టీడీపీ సీనియర్ నాయకులు కానాల కేశవరెడ్డి, శేషారెడ్డిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



డోన్ చిన్న మల్కాపురం గ్రామంలో కృష్ణారెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



గజమాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



డోన్‌లో వై.నాగేశ్వరరావు యాదవ్ స్వగృహంలో కొత్త సంవత్సర వేడుకలు



చాగలమర్రి: టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాను సన్మానిస్తున్న హమాలియూనియన్ సభ్యులు



బనగానపల్లె: నంద్యాల పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్యను అభినందిస్తున్న టీడీపీ అభిమానులు



రుద్రవరం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రవీందప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

యాగంటిలో పల్లకీసేవ

బనగానపల్లె , జనవరి 1: బనగానపల్లె మండలంలోని యాగంటిక్షేత్రంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యాగంటి ఉమామహేశ్వరులను ఆలయంలో పల్లకీలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉమామహేశ్వరస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



యాగంటిలో పల్లకీసేవ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

కొలిమిగుండ్ల, జనవరి 1: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామిని రథంలో గ్రామంలో ఊరేగించారు. గురుస్వాములు గౌడుస్వామి, సుబ్బరాయడిస్వామిల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు అయ్యప్పస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం కోకన్వీనర్ వీఆర్‌లక్ష్మిరెడ్డి, గ్రామ పెద్దలు వీఆర్ రామిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట మల్లారెడ్డి, సర్పంచ్ బోయశంకర్, మాజీ ఎంపీటీసీ ఓబులేసు , అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.



కనకాద్రిపల్లె గ్రామంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న అయ్యప్పస్వాములు, భక్తులు

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 1 : మండలంలోని వాసాపురం వెంకటేశ్వరసావ్మిఇ, లక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపిశర్మ మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శివశర్మ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. కొత్త సంవత్సర సందర్భంగా భక్తులు తరలివచ్చి వాసాపుంర వెంకటేశ్వరస్వామి, మానస లింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది తమకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రుద్రవరం: వాసాపురం వెంకటేశరస్వామి ఐకి పూజలు చేస్తున్న భక్తులు